గిడసబారిన ఆశలు!

- ఎదుగుదల లేకపోవడంతో నువ్వుల పంటను దున్నేసిన రైతులు
- రాచర్ల మండలంలోని 3 గ్రామాల్లో 80 ఎకరాల్లో పంట ధ్వంసం

రాచర్ల: మెట్ట భూముల్లో వర్షాధారంగా సాగు చేసిన నువ్వుల పంట పూత, పిందె రాక గిడసబారిపోవడంతో రైతులు చేజేతులా పీకేసి దుక్కి దున్నేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో జూన్ నెలలో ఓ మోస్తరు వర్షాలు కురువగా నల్లరేగడి పొలాలు కాస్త పదునెక్కడంతో రైతులు నువ్వుల పంట సాగు చేశారు. మొలకలు బాగానే వచ్చాయని సంతోషించేలోపే వాన జాడ లేకపోవడం, తీవ్రమైన ఎండ కాయడంతో వాడుముఖం పట్టింది. ఈ తరుణంలో అడపాదడపా జల్లులు పడటంతో పంట పూత దశకు చేరుకుంది. అప్పటి నుంచి వర్షాలు లేకపోవడంతో పూత సరిగా రాక కాయలు కాయలేదు. పంట మొత్తం గిడసబారిపోవడంతో రైతులు చేసేదేమీ లేక దుక్కులు దున్నుకుంటున్నారు. మండలంలోని అనుములపల్లె, అనుమలవీడు, రాచర్ల, గౌతవరం, రంగారెడ్డిపల్లె, యడవల్లి, చోళ్లవీడు, ఆకవీడు గ్రామాల్లో సుమారు 216 ఎకరాల్లో నువ్వుల పంట సాగు చేశారు. అనుమలవీడు, గౌతవరం, అనుములపల్లె, రంగారెడ్డిపల్లె, రాచర్ల గ్రామాల్లో 80 ఎకరాలకు పైగా నువ్వుల పంటను రైతులు దున్నేసి, రబీ సీజన్‌లో పప్పు శనగ సాగు చేసుకునేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. ఎకరా నువ్వుల పంట సాగుకు చేసేందుకు రూ.10 వేలకు పైగా పెట్టుబడి పెట్టామని, వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పూర్తిగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




గౌతవరంలో నువ్వుల పంట దున్నేసిన రైతులు (ఇన్‌సెట్‌లో) అనుమలవీడులో సాగు చేసిన నువ్వుల పంట

స.హ చట్టంతో జవాబుదారీతనం



అవగాహన ర్యాలీలో ఉద్యోగులు

మార్కాపురం: సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు జవాబుదారీతనం అందుబాటులోకి వచ్చిందని డివిజనల్ సహకార అధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. గురువారం మార్కాపురం పట్టణంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా వ్యక్తిగత, ప్రజాప్రయోజనాలకు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహకారశాఖ సిబ్బంది, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు శిక్షణ



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ పవన్‌కుమార్

మార్కాపురం టౌన్: భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీలు నైపుణ్యం పెంపొందించుకునేందుకు శిక్షణ కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని హౌసింగ్ డీఈ పవన్‌కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 నుంచి 45 ఏళ్ల వయసున్న భవన నిర్మాణ కార్మికులు శిక్షణకు అర్హులని స్పష్టం చేశారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి కల్పిస్తామని తెలిపారు. సీపీఐ కార్యదర్శి ఎస్‌కే ఖాశిం, మేస్త్రీల సంఘం కార్యదర్శి బుచ్చిబాబు, షేక్ బాషా, వర్క్‌ఇన్‌స్పెక్టర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

రేపు బేస్తవారిపేటలో ఎడ్ల పందేలు

బేస్తవారిపేట: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా స్థానిక త్రిలోక పుణ్యక్షేత్రంలో ఈనెల 16వ తేదీన రెండు పళ్ల విభాగంలో ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి పది బహుమతులు వరుసగా రూ.20 వేలు, రూ.16 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2,500, రూ.2 వేలు అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 8919095615ను సంప్రదించాలని సూచించారు.

సెరీకల్చర్‌లో గెస్ట్ ఫ్యాకల్టీ అవకాశం

కంభం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెరీకల్చర్ కోర్సు బోధన నిమిత్తం 2025–26 విద్యా సంవత్సరానికిగాను గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి ఈనెల 22వ తేదీన ఉదయం 11 గంటలకు కళాశాల ప్రాంగణంలో బోధన నైపుణ్యత పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సైమన్ విక్టర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎమ్మెస్సీ సెరీకల్చర్/అగ్రికల్చర్/బాటని/జువాలజీలో 50 శాతం ఉత్తీర్ణత లేదా బీఎస్సీ అగ్రికల్చర్ లేదా తత్సమాన కోర్సులో 60 శాతం ఉత్తీర్ణత సాధించి ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, బోధనోపకరణాలతో నేరుగా హాజరు కావాలని సూచించారు.

చినుకులు పడితే రోడ్లు చిత్తడే..

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల, గనివానిపాడు, పాతపాడు, కొనకనమిట్ల గ్రామాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై నీరు నిల్వ చేరి బురదమయం కావడంతో స్థానికులు నడిచేందుకు కూడా వీల్లేని దుస్థితి. దోమలు వ్యాప్తి చెందడంతోపాటు దుర్వాసన వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మహనీయుల బాటలో నడుద్దాం

- ప్రజలకు 'అన్నా' స్వాతంత్ర్య దిన శుభాకాంక్షలు



అన్నా రాంబాబు

మార్కాపురం: మహనీయుల అడుగుజాడల్లో నడుస్తూ.. వారి ఆశయాలు కొనసాగిస్తూ స్వాతంత్ర్య ఫలాలు సమాజంలో ప్రతి ఒక్కరికీ సమానంగా అందేలా కృషి చేయాల్సిన అవసరం ఉందని మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ ప్రజలు, అధికారులకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు.

స్వాతంత్ర్య వేడుకలకు హాజరుకావాలి

బేస్తవారిపేట: స్వాతంత్ర్య దిన వేడుకలకు మాజీ సైనికులు, సైనిక వితంతువులు, సైనికులు, సైనిక కుటుంబాల ప్రతినిధులు హాజరుకావాలని నియోజకవర్గ మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొల్లా బాలిరెడ్డి కోరారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం కార్యాలయాల్లో శుక్రవారం ఉదయం 8.30 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అమరవీరుల స్థూపానికి తుదిమెరుగులు దిద్దడంపై చర్చిస్తామని తెలిపారు.

పాలిటెక్నిక్ అధ్యాపకుడికి డాక్టరేట్



వెంకటేశ్వరరెడ్డి

కంభం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ అధ్యాపకుడు, కంభం పట్టణానికి చెందిన కుందురు వెంకటేశ్వర రెడ్డికి కాకినాడ జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.బాలాజి పర్యవేక్షణలో 'ఎఫిసియంట్ వీఎల్‌ఎస్‌ఐ ఇంప్లిమెంటేషన్ ఫర్ న్యూరోమార్ఫిక్ కంప్యూటింగ్' అంశంపై ఆయన చేసిన పరిశోధనకుగాను పీహెచ్‌డీ లభించింది. డాక్టరేట్ పొందిన వెంకటేశ్వర రెడ్డిని ఎస్‌ఎల్‌వీ బీఈడీ కళాశాల కరస్పాండెంట్ నరాల ఈశ్వరరెడ్డి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందించారు.